



తుంగభద్ర జలాలపై కర్ణాటక కన్ను..!

- నదిపై రెండు ప్రాంతాల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజీలకు ప్రతిపాదన
- అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఇంజనీర్లపై ఒత్తిడి
- కేసీ కాలువ నీటి వాటాపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికీ వెంటాడుతున్న ఆర్డీఎస్ ఆనకట్ట వివాదం
- అనుమతి ఇవ్వబోమంటున్న ప్రజాప్రతినిధులు


తుంగభద్ర నదిపై చికలపర్వి బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక ప్రతిపాదించిన ప్రదేశం


తుంగభద్ర జలాలపై ఎగువ రాష్ట్రం కర్ణాటక కన్నేసింది. ఇప్పటికే కొప్పల్ జిల్లా గంగావతి తాలుకా నవలి వద్ద 31 టీఎంసీల సామర్థ్యంలో నవలి జలాశయశం నిర్మాణానికి ఎత్తులు వేస్తోంది. డీపీఆర్ తయారీ కోసం రూ.13.40 కోట్లు కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. దీనిని మన ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. తాజాగా తుంగభద్ర నదిపై చిలకపర్వి-కుంబళూరు మధ్య, చిన్నమంచాల-మంత్రాలయం మధ్య రెండు బ్రిడ్జి కమ్ బ్యారేజీల నిర్మాణాలకు కర్ణాటక సన్నాహాలు చేస్తోంది. వీటికి అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటూ రెండు రోజులుగా కర్ణాటక అధికారులు కర్నూలులో మకాం వేసి మన ఇంజనీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ బ్యారేజీలు నిర్మిస్తే కేసీ కాలువ నీటివాటాపై తీవ్ర ప్రభావం ఉంటుందని సాగునీటి నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ ఆనకట్ట వివాదం వెంటాడుతోంది. మళ్లీ కొత్త జల వివాదాలకు తెర తీస్తారా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. తుంగభద్రపై కర్ణాటక చేపట్టేబోయే బిడ్జి కమ్ బ్యారేజీలను అనుమతించమని మన ప్రజాప్రతినిధులు అంటున్నారు.

కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం 131.29 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. జూన్ ఒకటో తేదీ నుంచి మే 31 వరకు ఒక నీటి సంవత్సరంలో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 212 టీఎంసీలు వినియోగించుకునేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ (కేడబ్ల్యూడీటీ) అవార్డు-1 కేటాయింపుల ప్రకారం కర్ణాటక 138.99 టీఎంసీలు, ఏపీ, తెలంగాణ ఉమ్మడిగా 73.01 టీఎంసీలు వాడుకోవాలి. ఏపీ నీటి వాటా 66.50 టీఎంసీలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీకి 24 టీఎంసీలు, కేసీ కాలువకు 10 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ ద్వారా 32.50 టీఎంసీలు కేటాయించారు. ఏటా టీబీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశమై డ్యాంలో చేరే వరదను అంచనా వేస్తుంది. కేడబ్ల్యూడీటీ కేటాయింపుల దామాషా ప్రకారం నీటి వాటా కేటాయిస్తారు. గత పదేళ్లలో డ్యాంలో చేరిన వరద లెక్కలు పరిశీలిస్తే ఏటా సగటున డ్యాంలో 160-180 టీఎంసీలకు మించి చేరడం లేదు. కేసీ కాలువకు కేటాయించిన నీటివాటాను తుంగభద్ర నది ద్వారానే తీసుకోవాల్సి ఉంది. పైగా తుంగభద్రకు ఏటేటా వరద దినాలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తుంగభద్రపై ఎగువన కర్ణాటక బ్యారేజీలు నిర్మాణం చేపడితే దిగువన ఉన్న కేసీ కాలువ ఆయకట్టుతో పాటు, నదీతీర గ్రామాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రాయలసీమ సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు బ్రిడ్జి కమ్ బ్యారేజీలకు ప్రతిపాదనలు

కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి తాలుకా చికలపర్వి గ్రామం, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంబళనూరు గ్రామాలను కలుపుతూ తుంగభద్ర నదిపై రూ.397.50 కోట్ల ఖర్చుతో 0.35 టీఎంసీల సామర్థ్యంతో చికలపర్వి బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక మైనర్ ఇరిగేషన్ శాఖ ప్రతిపాదన సిద్ధం చేసింది. అలాగే రాయచూరు జిల్లా చిన్నమంచాల, కర్నూలు జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం మధ్య రూ.350 కోట్లతో 0.31 టీఎంసీల సామర్థ్యంలో రెండో చిన్నమంచాల బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణాలను తెరపైకి తెచ్చింది. ఏపీ ఆమోదం లేకుండా వీటి నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని గ్రహించిన కర్ణాటక మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు భావిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు 11న కర్ణాటక మైనర్ ఇరిగేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి బోస్‌రాజ్ జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ఇంజనీర్లతో సమావేశమయ్యారు. అప్పట్లో ఇది రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. తుంగభద్ర జలాలపై కన్నేసిన కర్ణాటక వ్యూహాత్మకంగా మనల్ని ఒప్పించి నీటిని తీసుకెళ్లేందుకు ఎత్తులు వేస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

మిగతా 6వ పేజీలో..


కౌతాళం మండలం కుంబళనూరు వద్ద తుంగభద్రపై కర్ణాటక బ్యారేజీని ప్రతిపాదించిన ప్రాంతం గూగుల్ మ్యాప్

ఏక్ నిరంజన్..!

- నంద్యాలలో చర్చనీయాంశంగా మారిన మున్సిపల్ కమిషనర్
- నిన్న మాజీ సైనికుడు.. నాడు పెట్రోల్ బంక్ యజమాని
- నేడు ఓ సచివాలయ ఉద్యోగికి తిప్పలు
- సొంత శాఖ ఉద్యోగుల నుంచీ ఆరోపణలు
- కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి పన్ను



నంద్యాల మున్సిపల్ కార్యాలయం (ఫైల్)

నంద్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిపై ఉద్యోగరీత్యా పలు విమర్శలకు కేంద్రబిందువుగా మారారు. ఇటీవల ఆయనపై పలువురు ఆరోపణల నేపథ్యంలో ఇటు మున్సిపల్ శాఖ ఉద్యోగులు, ప్రజల్లో మున్సిపల్ కమిషనర్ చర్చనీయాంశంగా మారారు. వారం ఓ మాజీ సైనికుడి ఇంటి పన్ను మినహాయింపు నుంచి.. గతంలో ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకుడు, తాజాగా ఓ సచివాలయ ఉద్యోగి సెలవు మంజూరు విషయం వరకు ఆయన వ్యవహరించిన తీరుపై బాధిత వర్గాలు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వీటికితోడు ఓ మంత్రికి.. మరొకరికి చెందిన స్థలంపై ఎప్పటి నుంచో కోర్టు వివాదంలో ఉంది. అయితే గుట్టుచప్పుడు కాకుండా సదరు మున్సిపాలిటీ అధికారులు సదరు స్థలానికి పన్నులు వేయడం అప్పట్లో దుమారం రేపింది. ఏం జరిగిందో ఏమో కానీ కింద స్థాయి ఉద్యోగులను బలి చేసి వదిలేశారని సమాచారం. ఇలా నిత్యం ఏదో ఒక విధంగా నంద్యాల మున్సిపాలిటీతో పాటు సదరు కమిషనర్ తీరుపై పలు విమర్శలు వస్తుండటం సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. పైగా సదరు కమిషనర్ కూడా వీటన్నింటికి చెక్ పెట్టకపోవడం గమనార్హం. ఓ మాజీ సైనికుడి విషయంలో ఆయన వ్యవహరించిన తీరుపై కౌన్సిల్ సమావేశంలో కూడా చైర్‌పర్సన్‌తో పాటు టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు.

మిగతా 6వ పేజీలో..

అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం


- భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్(కుడా) సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం కుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు సత్వర ప్రయోజనాలు చేర్చేందుకు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రవేశపెట్టిందన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ద్వారా సమూలమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. లే అవుట్ అనుమతులు మంజూరులో పారదర్శకతతో పాటు కొన్ని నిబంధనలను సడలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్డు వెడల్పును 30 అడుగుల వెడల్పు గల కనీస రోడ్లను ఏర్పాటు చేయాలని సూచించిందన్నారు. నీటి పారుదల శాఖ, నేషనల్ హైవే తదితర శాఖల ద్వారా అవసరమై నిరభ్యంతర పత్రాలను త్వరితగతిన పొందేందుకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. భవన నిర్మాణ అనుమతుల మంజూరులో ప్రస్తుతం ఉన్న కఠినతర నిబంధనలను సరళతరం చేసిందన్నారు. నూతన విధానంతో భవన నిర్మాణ అనుమతులను మున్సిపల్ శాఖచే రిజిస్ట్రేషన్ పొందిన ఇంజనీర్లు/ప్లానర్లు-లైసెన్సుడు టెక్నికల్ పర్సన్‌ల ద్వారా తక్షణమే అనుమతులు మంజూరు ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. కుడా పరిధిలోని 896 గ్రామ పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్ల విస్తీర్ణం వరకు స్థలంలో భవన నిర్మాణ అనుమతులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్ పొందవచ్చన్నారు. రెండేళ్ల క్రితం నుంచి ఉమ్మడి జిల్లాలో అక్రమ అవుట్లు అధికమయ్యాయన్నారు. మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో 115 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు తీసుకున్న 15 రోజుల లోపల మిగిలిన వారందరు అనుమతులు తీసుకోకపోతే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 278 అక్రమ లేఅవుట్లను గుర్తించినట్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు వెల్లడించారు.

23న శ్రీశైలానికి సీఎం చంద్రబాబు

స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేత



నంద్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 23న శ్రీశైలం క్షేత్రానికి రానున్నారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా సీఎం నేరుగా హాజరై స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వస్తుండటం విశేషం. గతంలో ప్రభుత్వం తరుపున ఎవరైనా మంత్రులు వచ్చి పట్టువస్త్రాలు స్వామి వారికి సమర్పించేవారు. శ్రీశైలానికి సీఎం చంద్రబాబు వస్తున్నారన్న సమాచారంతో జిల్లా యంత్రాంగంతో పాటు ఆలయ అధికారులు కూడా తగిన ఏర్పాట్లుకు సిద్ధమయ్యారు.

నేరాల నియంత్రణపై నిఘా

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. బుధవారం బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, ప్రజా ఫిర్యాదుల వేదికను, కేసుల్లో పట్టుబడిన వాహనాలను, పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై నిఘా ఉంచామన్నారు. నేరాల అదుపునకు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. పేకాట, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల పై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించామన్నారు. అలాగే గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ముందస్తు సమాచారం రాబట్టి నేరాలను నియంత్రిస్తున్నట్లు తెలిపారు. కేసులను త్వరిత గతిన విచారించి వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని, రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ శ్రీనువాసులురెడ్డి, ఎస్ఐ జగన్మోహన్ ఉన్నారు.

కల్లు కార్మికులకు ఊరట

- మద్యం దుకాణాల దరఖాస్తుకు లైన్ క్లియర్
- 8 వరకు పొడిగింపు.. 10న లాటరీ ద్వారా ఎంపిక
- 11 దుకాణాలకు 38 దరఖాస్తులు


రవికుమార్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు హైకోర్టులో ఊరట లభించింది. మద్యం దుకాణాల లైసెన్సు ఖరారు చేయకుండా నిలువరించాలంటూ మద్యం దుకాణాల యాజమానులు చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో కల్లు గీత కార్మికులకు ఉపశమనం లభించినట్టయింది. గీత కార్మికుల మద్యం షాపుల దరఖాస్తులకు 8వ తేదీవరకు గడువు పెంచినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఎస్. రవికుమార్ తెలిపారు. బుధవారం నంద్యాలలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికుల్లోని ఈడిగ, గౌడ, గౌడ్ ఉపకులాలకు చెందినవారికి జిల్లాలో కేటాయించిన 11మద్యం షాపులకు ఇప్పటివరకు 38 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 5వ తేదీతో ముగియాల్సిన గడువును 8వ తేదీవరకు ప్రభుత్వం పొడిగించినట్లు చెప్పారు. ఆసక్తిగల గీత కార్మిక కులాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గీత వృత్తిదారుల్లోని ఉప కులాలకు 10శాతం మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. జిల్లాలో 11మద్యం షాపులకు గౌడ కులానికి 3, ఈడిగ ఉప కులానికి 7, గౌడ ఉప కులానికి ఒక మద్యం దుకాణాన్ని కేటాయించినట్లు చెప్పారు. నంద్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, డోన్, డోన్ రూరల్, ఉయ్యాలవాడ, పాములపాడు ఈడిగ ఉప కులానికి, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కొత్తపల్లి గౌడ కులానికి కేటాయించగా, పగిడ్యాల గౌడ ఉప కులానికి కేటాయించారని చెప్పారు. 8వ తేదీ సాయంత్రం 5గంటల లోపు నంద్యాలలోని ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రహస్యంగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఆన్‌లైన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన లాగిన్ నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 10వ తేదీ ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎంపిక కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై

అవిశ్వాసానికి సిద్ధం..!

- హైదరాబాద్‌కు 12 మంది వైసీపీ కౌన్సిలర్లు
- అవిశ్వాసానికి మద్దతుగా 16 మంది సంతకాలు?
- ఆత్మకూరులో ఉత్కంఠ రేపుతున్న చైర్మన్ పీఠం


డాక్టర్ మారూఫ్ ఆసియా

ఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియాను అవిశ్వాసంతో పదవి నుంచి దించేందుకు వైసీపీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీకే చెందిన ఆమెను ఆ పదవి నుంచి తొలగించి మరొకరికి కట్టబెట్టాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా బుధవారం సుమారు 12 మంది వైసీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిసింది. అంతేకాదు అవిశ్వాసానికి మద్దతుగా 16 మంది సంతకాలు చేసినట్లు సమాచారం. కాగా 2021 మార్చి 18వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ మారూఫ్ ఆసియా బాధ్యతలు చేపట్టారు. మరో 40రోజులు గడిస్తే అవిశ్వాసం తీర్మానం చేసేందుకు నాలుగేళ్ల పూర్తికానున్న తరుణంలో వైసీపీ కౌన్సిలర్లు ఇందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి పట్టణంలో మొత్తం 24 వార్డులు ఉండగా అప్పట్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి వైసీపీ నాయకులు అనేక విధాలుగా ఇతర పార్టీల అభ్యర్థులను బెదిరింపులకు, ప్రలోభాలకు పాల్పడి 15 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. దీంతో మొత్తంగా 20 స్థానాల్లో వైసీపీ, 3 స్థానాల్లో స్వతంత్రులు, ఒక స్థానంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. వైసీపీ తరపున కౌన్సిలర్‌గా ఎన్నికైన డాక్టర్ మారూఫ్ ఆసియాకు చైర్‌పర్సన్ పదవి వరించింది. అయితే ప్రస్తుతం ఆమె అదే పార్టీలో కొనసాగుతున్నప్పటికీ అంతర్గత విభేదాల కారణంగా ఆమెను తప్పించాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి డిసైడ్ అయినట్లు సమాచారం.

చైర్‌పర్సన్ తండ్రి వైఖరి నచ్చకనే..?

మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా తండ్రి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ.రషీద్ వైఖరి నచ్చకనే మాజీ ఎమ్మెల్యే శిల్పా, వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి చైర్‌పర్సన్ హోదాలో ఉన్నప్పటికీ తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతరులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని గతంలో అనేక మార్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా కౌన్సిల్ సభల్లోనే బహిర్గతంగా విమర్శించేవారు. అలాగే మాజీ ఎమ్మెల్యే శిల్పా వైఖరిని వ్యతిరేకిస్తూ కొన్నిరోజుల పాటు కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ వైసీపీ ముఖ్యమైన కార్యక్రమాలకు హాజరు కాకుండా దూరంగా ఉండేవారు. ఈ క్రమంలోనే 2024 ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో మంతనాలు జరిపి టీడీపీలోకి చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం వైసీపీ అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో ఏకంగా రాష్ట్ర నాయకులే రంగంలోకి దిగి వారికి సర్దిచెప్పి వైసీసీలోనే ఉండేలా చేశారు. అయితే ప్రస్తుతం వైసీపీలోనే ఉంటూ ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో పాటు వైసీపీ కౌన్సిలర్లను కలుపుకొని పోవడం లేదని, టీడీపీ నాయకులతో సత్సంబంధాలు కొనసాగుతున్నట్లు కారణాలను ఎత్తిచూపుతూ ఆయన కుమార్తెను చైర్మన్ పదవి నుంచి దించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆమె స్థానంలో రాష్ట్ర హజ్‌కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్ కుమార్తె మోమిన్ ఫర్హానా, ఎన్నికల ముందు టీడీపీలోకి వచ్చి మళ్లీ వైసీపీ పక్షాన చేరిన రహీం సతీమణి అఫ్రోజ్‌జహా, ఒకటో వార్డు కౌన్సిలర్ షేక్‌నూర్జహా చైర్మన్‌పదవి దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

మార్చిలోనే అవిశ్వాస తీర్మానం

వైసీపీ నాయకులు అనుకున్నట్లు అన్ని కుదిరితే మార్చి నెలలో అవిశ్వాసంపై మున్సిపల్ అధికారులకు ఆపార్టీ కౌన్సిలర్లు నోటీసులు ఇవ్వనున్నారు. వీటిని మున్సిపల్ కౌన్సిల్ సభలో తీర్మానం చేసి కలెక్టర్, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌కు నివేదించడం జరుగుతోంది. ఆ తర్వాత వారు ఆ తీర్మానాన్ని పరిశీలించి సవ్యంగా ఉన్నట్లయితే మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఎన్నిక ప్రక్రియను జరిపిస్తారు. ఈ ప్రక్రియ జరిగేలోగా నాలుగేళ్ల గడువు పూర్తవుతుందన్న భావనతోనే ముందస్తుగా వైసీపీ శ్రేణులు అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ అవిశ్వాస తీర్మానంపై కూటమి పార్టీల పెద్దలు ఏవిధంగా స్పందిస్తారన్నది వేచిచూడాల్సిందే. మొత్తానికి ఈ వ్యవహారం ఆత్మకూరు ప్రాంతంలో ఉత్కంఠ రేపుతోంది.


ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

రోడ్డు భద్రత.. మన బాధ్యత

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఓల్డ్ సీఎల్‌జీలో వైద్య సిబ్బందితో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు రహదారి భద్రతకు సంబంధించిన సీట్ బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ఎవరికైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి తరలించాలని, అలా చేయడం వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతి కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్‌లో నైపుణ్యం సరిగ్గా లేకపోవడం, రోడ్డు భద్రత జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం తీసుకోవద్దని, హెల్మెట్, సీటు బెల్టులు ఎల్లప్పుడూ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, కర్నూలు ఆర్టీవో భరత్ చౌహాన్, ట్రాఫిక్ సీఐ డీఎస్పీ మన్సూరుద్దీన్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- కలెక్టర్ పి. రంజిత్ బాషా పిలుపు
- స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనం ప్రారంభం



నూతన స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను పొందాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. బుధవారం బి.తాండ్రపాడులోని కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం శిక్షణా సంస్థలోని వర్క్‌షాపులు, జెంట్స్ డార్మెంటరీ, లేడీస్ డార్మెంటరీ, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్‌ను ప్రారంభించి పరిశీలించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు యూనిఫామ్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి కెనరా బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా వివిధ అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 45 సంవత్సరాల యువకులు పలు కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలు నడుస్తాయన్నారు. పురుషులకు టూవీలర్ మోటారు సైకిల్ సర్వీసింగ్, రిపేరు, సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోం వైరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. మహిళలకు టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణతో పాటు భోజన వసతి సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్, శిక్షణ సంస్థ డైరెక్టర్ పుష్ప కుమార్, ఎల్డీఎం రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, విద్యార్థినులు పాల్గొన్నారు.

'సాహిత్య పాఠశాల'ను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో ఈనెల 8, 9వ తేదీల్లో నగరంలో గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 'విరసం 24వ సాహిత్య పాఠశాల' సమావేశాలను విజయవంతం చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సి.క్యాంపులోగల టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విరసం బాధ్యులు పాణి, నాగేశ్వరాచారి, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు రత్నం ఏసేపు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు సుబ్బరాయుడు, జేవీవీ బాధ్యుడు సుంకన్న, పోస్టల్ యూనియన్ నాయకులు గిరి, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సంక్షోభ సమయంలో సాహిత్యకారుల పాత్ర' అనే ఇతివృత్తంతో ఏర్పాటు చేసిన ఈ రెండు రోజుల సాహిత్య పాఠశాల కార్యక్రమాల్లో వక్తలుగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంత, రచయిత అల్లం రాజయ్య రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు. దేశంలోని సమకాలీన రాజకీయాలు, సంక్షోభ సందర్భాలు మొదలైన అంశాలపై ప్రసంగాలు, చర్చలు, కవితా సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ సమావేశాలకు రచయితలు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

19 నుంచి టీసీసీ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ (లోయర్, హైయర్) పరీక్షలు గుర్తింపు పొందిన పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకుని హాజరు కావాలన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు తప్పనిసరిగా పాస్‌పోర్టు, పాన్ కార్డు కానీ, ప్రభుత్వం జారీ చేసిన ఏదేని ఒక ఒరిజినల్ చెల్లుబాటయ్యే గుర్తింపు కార్డుతోపాటు ఓటర్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మనసు పదిలంగా ఉండాలి



- విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవాలి
- పరీక్షల మధ్య విరామంతో ఉపశమనం
- జిల్లా 38,560 మంది విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్ , ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థులకు ఒత్తిడి పెరగడం సహజం. పదో తరగతి విద్యార్థులో అది మరి ఎక్కువ. రాత్రంతా కష్టపడి చదివినదంతా పరీక్ష రాసే సమయంలో మర్చిపోతుంటామని ఆందోళన చెందుతుంటారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి సిద్ధమైన కూటమి ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల అంతర్మథనాన్ని గమనించింది. ఓ చక్కటి ప్రణాళికను రూపొందించి మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్‌ను విడుదల చేసి, ప్రతి పరీక్షకు మధ్యలో ఒక రోజు విరామం ఉండేలా ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ షెడ్యూల్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 514 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం విద్యార్థులు 38560 మంది ఉన్నారు.

సమయం ఆదా..

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పది పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. ప్రతి పరీక్షకు మధ్యలో ఒక రోజు విరామం ఉంచారు. మధ్యలో సెలవులు రావడం ద్వారా విద్యార్థులపై ఒత్తిడి తగ్గనుంది. ఒక్కోసారి రెండు, మూడు రోజులు సెలవులు కలిసి వచ్చాయి. దీంతో తర్వాత పరీక్షకు హాజరవడానికి తగిన సమయం, పాఠ్యాంశాల పునశ్చరణకు అవకాశం ఉండడంతో విద్యార్థులకు ఊరట కల్గింది.

గతంలో తీవ్ర ఒత్తిడి...

గతంలో పదో తరగతి పెడ్యూలులో పండుగలు, వారాంతపు సెలవులు ఉండేవి. అలా నిర్వహించే షెడ్యూల్ వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. ఇది ఇలా ఉంటే కొన్నేళ్ల నుంచి పాఠ్యాంశాలకు రెండు పేపర్ల విధానం తొలగించి ఒక పేపర్ మాత్రమే నిర్ధారించి పరీక్షలు నిర్వహించడం వారిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టినట్లయింది. దీని వల్ల వరస పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అయోమయ స్థితికి చేరుకుని మార్కుల సాధనలో వెనుకబడిపోయారు. మరి కొందరైతే పరీక్షలో విఫలమయ్యారు.

సిలబస్‌ను రివిజన్ చేసుకునేందు అవకాశం

పరీక్షల మధ్యలో సెలవులు రావడం వల్ల పూర్తి సిలబస్‌ను రివిజన్ చేసుకునేందుకు ఇది మంచి అవకాశం. వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉండడంతో నేర్చుకున్న పాఠ్యాంశాలను మరోసారి చదువుకునేందుకు వీలు ఉంటుంది. గతంలో 50 మార్కులకు పేపర్ ఉండడంతో గ్యాప్ ఉండేది కాదు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి నిర్ణయం తీసుకున్నారు. పది పరీక్షల నిర్వహణకు ఒక్కో రోజు విరామం రావడం ఇదే తొలిసారి. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు వీలు కలుగుతుంది.

-జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ జి. చంద్ర భూషణ్



తుంగభద్ర జలాలపై కర్ణాటక కన్ను..!

(5వ పేజీ తరువాయి)

చికలపర్వి-కుంబళనూరు మధ్య తుంగభద్ర నదిపై నిర్మించబోయే బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటూ ఆ రాష్ట్రం కొప్పల్ జిల్లా మైనర్ ఇరిగేషన్ ఈఈ, డీఈఈల బృందం రెండు రోజులుగా కర్నూలులో మకాం వేశారు. జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్‌రెడ్డిలను విన్నవించారు. ఈ బ్యారేజీ నిర్మాణం వల్ల కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లో నదీతీరంలోని 40 గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా తాగునీటి సమస్య తీరుతుందని కర్ణాటక వాదన. అయితే తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కాలువ నీటివాటా 10 టీఎంసీల మేర నదిగుండానే తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం డ్యాంలో ఒక టీఎంసీ విడుదల చేస్తే సుంకేసుల బ్యారేజీకి అర టీఎంసీ కూడా చేరడం లేదు. అదే క్రమంలో ఆర్డీఎస్ ఆనకట్ట వివాదం వెంటాడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో డ్యాం దిగువన 144 కి.మీల వద్ద కర్ణాటక బ్యారేజీ నిర్మాణం చేపడితే కేసీ కెనాల్ ఆయకట్టు రైతులతో పాటు నదీతీర గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు కర్ణాటక వైపున ఆ రాష్ట్రం ఎత్తిపోతల ద్వారా తుంగభద్ర జలాలు తరలించుకుపోయే ప్రమాదం లేకపోలేదు. భారీ వరదలు వస్తే తప్ప బ్యారేజీ దాటి దిగువకు నీరు వచ్చే అవకాశం ఉండదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా ఈ బ్యారేజీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కర్ణాటక ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించబోమని ఏపీ ఇంజనీర్లు అంటున్నారు.

అలగనూరుకు రూ.36.26 కోట్లు ఇవ్వండి



అలగనూరు జలాశయం

- రాష్ట్ర ప్రభుత్వానికి సీఈ ప్రతిపాదన
- వైసీపీ హయాంలో మరమ్మతులపై అంతులేని నిర్లక్ష్యం
- మరమ్మతులపై ఎమ్మెల్యే గౌరు చరిత పట్టు

కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అలగనూరు జలాశయం శాశ్వత మరమ్మతుల కోసం రూ.36.26 కోట్లు నిధులు ఇవ్వాలంటూ జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా బుధవారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తక్షణ మరమ్మతులు చేపట్టడంతో నీటిని నిల్వ చేయవచ్చని ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. కేసీ కాలువ పరిధిలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1,73,627 ఎకరాలు, కడప జిల్లాలో 92,001 ఎకరాలు కలిపి 2,65,628 ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందుతుంది. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో 259 గ్రామాలకు జల ప్రయోజనాలు అందించే కేసీ కాలువకు కేడబ్ల్యూడీటీ అవార్డు (జస్టిస్ బచావత్ అవార్డు)-1 ప్రకారం 31.90 టీఎంసీలు నికర జలాల వాటా ఉంది. అయితే రబీ సీజన్‌లో కడప జిల్లాలో ఆయకట్టుకు సాగునీరు అందని దైన్యంగా మారుతుంది. చివరి ఆయకట్టు రైతుల కష్టాలు తీర్చాలనే లక్ష్యంగా మిడ్తూరు మండలం అలగనూరు సమీపంలో 2.965 టీఎంసీల సామర్థ్యంతో అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. కేసీ కెనాల్ నుంచి 119.65 కిలోమీటరు వద్ద ఇన్‌లెట్ చానల్ ద్వారా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటి మళ్లిస్తున్నారు. 2005లో తొలి సారిగా నిర్దేశిత సామర్థ్యం మేరకు నీటిని నింపుతున్నారు. వేసవిలో అలగనూరు రిజర్వాయర్ నుంచి కుందూ నదికి విడుదల చేసి రాజోలి ఆనకట్టకు నీటిని తరలించి కడప జిల్లాలో కేసీ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం ఈ జలాశయం ప్రధాన లక్ష్యం. నంద్యాల జిల్లాలో గడివేముల, బండిఆత్మకూరు మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

నిర్లక్ష్యం చూపిన గత ప్రభుత్వం

కీలకమైన ఈ జలాశయం 2917లో 2.50 కి.మీల నుంచి 2.75 కి.మీల వరకు సుమారు వంద మీటర్లు మట్టికట్ట కుంగిపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.38 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటిని నింపింది. 2019లో మరోసారి తాత్కాలిక మరమ్మతులు చేశారు. రూ.3 కోట్లతో శాశ్వత మరమ్మతులు పనులు చేపట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. రూ.25.47 కోట్లతో మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. ఐదేళ్లలో గంపెడు మట్టి కూడా తీయలేదు. డ్యాం భద్రతా నిపుణులు కేవీ సుబ్బారావు, రైతు సత్యనారాయణ నేతృత్వంతోని నిపుణులు కమిటీ, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్‌ఆర్‌పీ) నిపుణుడు ఏబీ పాండ్య కమిటీలు అలగనూరు జలాశయాన్ని సందర్శించి శాశ్వత మరమ్మతులపై పలు సూచనలు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అలగనూరు జలాశయం శాశ్వత మరమ్మతులు చేపట్టి నీటిని నింపాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. అదే సమయంలో ఐఏబీ, జడ్పీ సమావేశాల్లో కూడా గళమెత్తారు. ఇంజనీర్లు స్పందించి శాశ్వత మరమ్మతులకు రూ.36.26 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి వచ్చే వేసవిలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల జలాశయం చుక్కనీరు లేకుండా ఒట్టిపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి రాకుండా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏక్ నిరంజన్..!

(5వ పేజీ తరువాయి)

కమిషనర్ తీరు మొదటి నుంచి వివాదాస్పదంగా ఉందని ఆ శాఖ వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరానికి చెందిన ఓ మాజీ సైనికుడు తన ఇంటికి సంబంధించి పన్ను మినహాయింపు ఇవ్వాలని పలుమార్లు మున్సిపాలిటీ చుట్టూ తిరిగాడు. ఏమాత్రం పట్టించుకోలేదు. చివరికి ఒక రోజు కార్యాలయం వద్ద కళ్లు తిరిగి పడిపోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఆ తర్వాత సదరు మాజీ సైనికుడు చనిపోయాడు. ఇంతలోనే సదరు ఇంటికి సంబంధించి పన్నుల మినహాయింపు ఇస్తూ సదరు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయంపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో సదరు ఆయన బాధిత కుటుంబ సభ్యులకు క్షమాపణ కోరారు. ఇదే క్రమంలో ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకుడు తమ పెట్రోల్ బంక్ వద్ద డివైడర్‌ను తొలగించాలని కమిషనర్‌ను కలిశారు. ఈ క్రమంలో కమిషనర్ డబ్బులు డిమాండ్ చేయడంతో కొంత అమౌంట్ ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత కూడా పని కాకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కమిషనర్ ప్రకాశం జిల్లాలో పనిచేసే సమయంలో ఓ పెట్రోల్ బంక్ అనుమతి కోసం రూ.లక్షలు తీసుకున్నారని చెప్పడంతో పాటు తాజాగా డివైడర్లు తొలగించడం కోసం రూ. 50 వేలు ఇచ్చారని వీడియో ద్వారా వైరల్ చేశారు. ఇదే క్రమంలో నంద్యాల మల్దార్‌పేట సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న జయలక్ష్మి తమ కుమారుడికి ఆరోగ్యం సరిగ్గాలేదని తమ సచివాలయ అడ్మిన్‌తో పాటు కమిషనర్ నుంచి కూడా అనుమతి తీసుకున్నాను. కానీ తన కుమారుడికి ఆరోగ్యం కుదట పడకపోవడంతో సెలవును మరింత పొడిగించాలని కోరడంతో అడ్మిన్ కమిషనర్‌ను కలవాలని సూచించారు. దీంతో బాధిత ఉద్యోగి సోమవారం సదరు కమిషనర్‌ను కలిస్తే.. 'నా పర్మిషన్ లేకుండా సెలవు ఎలా తీసుకున్నావ్..' అంటూ పలు రకాలుగా మండిపడినట్లు సమాచారం. ఈ క్రమంలో ఏమీ చేయలేక బాధిత ఉద్యోగి జరిగిన వ్యవహారంపై ఆవేదన వ్యక్తం చేసింది. 'అన్ని అనుమతులతో సెలవు తీసుకున్నా. నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి. అయినా కూడా నా జీతాన్ని హోల్డ్ చేశారు. నాకు న్యాయం చేయండి...' అంటూ మీడియా ఎదుట వాపోయింది. ఇలా పలు రకాలుగా ఉన్నతాధికారి వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు మున్సిపల్ శాఖ ఉద్యోగులు బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

కోర్టు వివాద స్థలంపై పన్నులు..

సాధారణంగా ఎవరైనా వెళ్లి పన్నులు వేయాలని మున్సిపాలిటీకి వెళ్తే పలు రకాలుగా పరిశీలించి వేస్తారు. అయితే కొన్ని నెలల కిందట ఏకంగా ఓ మంత్రికి.. మరొకరికి చెందిన స్థలం కోర్టులో ఉన్నప్పటికి సదరు మున్సిపాలిటీ పన్నులు వేయడం పలు విమర్శలకు దారి తీసింది. ఈ క్రమంలో కమిషనర్‌పై తీవ్ర స్థాయిలో సదరు మంత్రి మండిపడినట్లు తెలిసింది. అయితే చివరికి కొందరు కింద స్థాయి ఉద్యోగులకు బలి చేసి ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలు లేకపోలేదు. ఏది ఏమైనా కోర్టులో ఉన్న స్థలంపై పన్నులు వేయడంపై అప్పట్లో పలు రూపాలుగా విమర్శలు జోరందుకున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

నంద్యాల మున్సిపల్ కమిషనర్‌పై వచ్చిన కొన్ని అభియోగాలు, ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు నివేదించాం. భవిష్యత్‌లో ఎలాంటి విమర్శలు, ఆరోపణలు లేకుండా చూసుకోవాలని సూచించాం. ప్రజలకు, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో సేవలు అందించేలా చూస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పక పాటిస్తాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి. ఎవరైనా నిబంధనలకు అతిక్రమించి పనిచేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

- విశ్వనాథ్, మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు : డీఎం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రాలకు నంద్యాల జిల్లా నెలవు. శివరాత్రి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలం, మహానంది, నంద్యాల, యాగంటి తదితర శైవ క్షేత్రాలకు వేలాదిగా తరలివస్తుంటారు. ఈ క్రమంలో ప్రజా రవాణా వ్యవస్థ చాలా కీలకంగా వ్యవహరిస్తుంది. శివరాత్రి సందర్భంగా ప్రయాణికులకు అందించే సేవల గురించి నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ అల్లాడి గంగాధర రావుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

ఆంధ్రజ్యోతి: శివరాత్రి సందర్భంగా ఎన్ని బస్సులు నడుపుతారు?

డీఎం: శైవ క్షేత్రాలను సందర్శించే భక్తులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు సర్వీసును కొనసాగిస్తాం.

ఆంధ్రజ్యోతి: ఏ శైవ క్షేత్రాలకు ఎన్ని బస్సులు?

డీఎం: శ్రీశైలానికి 20 బస్సులు, ఓంకారంతో పాటు భోగేశ్వరానికి ఒక బస్సు ఉంటుంది. రద్దీని బట్టీ ఈ క్షేత్రాలకు అదనపు బస్సులు నడుపుతాము. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇతర శాఖల సహకారం ఎలా ఉంది?

డీఎం: శివరాత్రి సందర్భంగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులు ప్రయాణించే మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయటంతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఉన్న చోట జీబ్రా లైన్లు వేయడంతో పాటు రహదారుల్లో గుంతలు పూడ్చమని ఆర్‌అండ్‌బి అధికారులను కోరాం. రాత్రివేళల్లో ఆయా గ్రామాల మార్గాల్లో వీధి లైట్లు వెలిగేలా చూడాలని విద్యుత్ అధికారులను కోరాం.

ఆంధ్రజ్యోతి: ప్రయాణికులకు మీరు అందించే ఇతర సేవలేవైనా ఉన్నాయా?

డీఎం: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవల ప్రభుత్వం వాట్సప్‌లో టికెట్ బుకింగ్ సేవలు తెచ్చింది. ప్రయాణికులు 95523 00009 అనే వాట్సప్ నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పెడితే అందుబాటులో ఉన్న ఆర్టీసీ సేవలు కనిపిస్తాయి. అందులో బుకింగ్/రద్దు అనే ఆప్షన్‌ను ఎంపిక చేసి తమ తమ ప్రయాణ ప్రదేశం, గమ్యస్థానం, తేదీ టైప్ చేస్తే అందుబాటులో ఉన్న బస్సుతో పాటు సీట్ల వివరాలను ప్రయాణికులు పొందవచ్చు. ఎంపిక తర్వాత డిజిటల్ చెల్లింపు చేస్తే ప్రయాణికుడి వాట్సప్‌కు బస్ టికెట్ వస్తుంది. వాట్సప్ సేవలు ఉపయోగించుకుని ప్రయాణికులు తమ విలువైన సమయాన్ని కాపాడుకోవచ్చు.

నేటి నుంచి బాలోత్సవం



కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో కర్నూలు బాలోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రవీంద్ర పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి జేఎస్ శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్ తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలకు 2వేలమంది విద్యార్థులు భాగస్వాములు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు మన సంస్కృతీ, సంప్రదాయాలను తెలియజేసేలా బాలోత్సవ కమిటీ రెండు రోజుల పాటు ఉత్సాహ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నదన్నారు. ఇప్పటికే ఇండస్ మాంటిస్సోరీ పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొదటి రోజు ఈ కార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ హాజరై పతాకావిష్కరణ చేసి వేడుకలను ప్రారంభిస్తారన్నారు. 35 రకాల ఈవెంట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని విజ్ఞప్తి చేశారు.

9 నుంచి ఘంటసాల ఆరాధనోత్సవాలు



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, దివంగత ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం, ఘంటసాల గాన కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల ఘంటసాల ఆరాధనోత్సవాల్లో 9న కర్నూలు గాయకులు సుధారాణి, శ్రీనివాసులు, హబీబ్ తదితరులు ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. కన్వీనర్‌గా గాయకుడు చంద్రకంటి మద్దయ్య, శ్రీనివాస రెడ్డిలు వ్యవహరిస్తారని తెలిపారు. 10న హైదరాబాదుకు చెందిన గాయకులు అఖిల, పీవీ రమణ బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని, కన్వీనర్‌గా బీఎస్ రావు వ్యవహరిస్తారని తెలిపారు. 11న హైదరాబాదు గాయకులు వాణికుమారి, వీరలక్ష్మి, పి. రవీందర్, డాక్టర్ వీఎస్ మూర్తిల బృందం ఆధ్వర్యంలో జరిగే సంగీత విభావరికి హైదరాబాదు ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కేవీ రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వారు వివరించారు.

మోడు చెట్టుకు కాసిన 'కొంగలు'



తూడిచర్ల ఏబీఆర్ కాల్వ మోడువారిన చెట్టుపై కొంగలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడిచర్ల గ్రామ సమీపంలో అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏబీఆర్)కు వెళ్లే కాల్వపై మోడుబారిన చెట్టుపై కొంగలు వాలాయి. కొమ్మకొమ్మపై ఓ ఒకటి రెండు కొంగలు కూర్చొని చెట్టుకే కాశాయా అన్నట్టుగా కనిపించాయి. ఈ దృశ్యం రహదారిపై వెళ్లే వారిని కనువిందు చేస్తోంది.

జీరో వ్యాపారానికి చెక్


కర్నూలు మార్కెట్‌లో రైతులు విక్రయానికి తెచ్చిన వాముపొట్టు బస్తాలు

క్వింటం వాము పొట్టు ధర రూ.7,269

సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వాముతో పాటు వాము పొట్టును రైతులు గతంలో తక్కువధరకే వ్యాపారుల చేతుల్లో పెట్టేవారు. బస్తా వాము పొట్టుకు వ్యాపారులు 100 నుంచి రూ.150లు మాత్రమే చెల్లించేవారు. కనీసం ఈ వాము పొట్టుపై సెస్సును కూడా మార్కెట్ యార్డుకు చెల్లించడం లేదు. దీంతో అటు రైతుల నుంచి కర్నూలు మార్కెట్ యార్డు అధికారుల కళ్లు గప్పి పెద్ద ఎత్తున వాము పొట్టు ద్వారా వ్యాపారులు జేబులు నింపుకునేవారు. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీగా ఉన్న జయలక్ష్మి వ్యాపారుల అక్రమాలకు చెక్ పెట్టారు. ఇకపై వాము పొట్టును కూడా వ్యాపారులు టెండరులోనే రైతుల నుంచి కొనుగోలు చేయాలని, సెస్సును కూడా చెల్లించాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి వాము పొట్టు వల్ల రైతులకు భారీ ప్రయోజనం చేకూరడమే కాకుండా పెద్ద మొత్తంలో సెస్సు కూడా అందే అవకాశం ఏర్పడింది.

బుధవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 18 క్వింటాళ్ల వాము పొట్టును రైతులు తీసుకువచ్చారు. క్వింటం వాము పొట్టు ఏకంగా గరిష్ఠ ధర రూ.7,269, మధ్యస్థ ధర రూ.1,760, కనిష్ఠ ధర రూ.501 దక్కింది. ఎన్నడూ లేనివిధంగా వాము పొట్టుపై కూడా తమకు ఆదాయం రావడంతో రైతులు సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎండుమిరప క్వింటా గరిష్ఠంగా రూ.13,001, మధ్యస్థ ధర రూ.11,769, కనిష్ఠ ధర రూ.2,199 దక్కింది. వేరుశనగకాయలకు గరిష్ఠ ధర రూ.5,559, మధ్యస్థ ధర రూ.5,320, కనిష్ఠ ధర రూ.2,117 అందింది. ఆముదాలకు గరిష్ఠ ధర రూ.5,662, మధ్యస్థ ధర రూ.5,662, కనిష్ఠ ధర రూ.5,319 అందింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,289, మధ్యస్థ ధర రూ.1,923, కనిష్ఠ ధర కూడా అదే మొత్తంలో రైతులకు చేరింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,250, మధ్యస్థ ధర రూ.1,619, కనిష్ఠ ధర రూ.950 చొప్పున పలికింది.

దళారులను నమ్మి మోసపోవద్దు

- గిట్టుబాటు ధర అందుకోండి
- మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకుంటోందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు, నాఫెడ్ ఏపీ ఇన్‌చార్జి పీఎస్ శర్మ, డీసీఎంఎస్ మేనేజర్ రాజీవ్ అన్నారు. బుధవారం కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామంలో కందులు పండించిన రైతులకు నాణ్యతపై అవగాహన కల్పించారు. కందులకు క్వింటానికి రూ.7,550 అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.ప్రతి గ్రామంలో రైతులు పండించిన కందులను కొనుగోలు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

రైతుకు సాయంగా డ్రోన్‌లు


డ్రోన్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

- గత ప్రభుత్వంలో ప్రకటనలకే పరిమితం
- ముఖ్యమంత్రి చొరవతో ముందుకు కదిలిన యంత్రాంగం
- మార్చిలోపు గ్రౌండింగ్ చేస్తామంటున్న వ్యవసాయాధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకా రం చుట్టింది. అందులోభాగంగా డ్రోన్‌ల వినియోగానికి పెద్ద పీట వేసింది. వ్యవసాయానికి మరింత టెక్నాలజీని జోడించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కూలీల కొరత తీర్చేందుకు డ్రోన్‌ల ఉపయోగం ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావించి డ్రోన్‌ల వినియోగం పట్ల మరిన్ని అడుగులు ముందుకే సింది. అందుకు సరిపడా నిధులను మంజూరు చేసింది.


గత ప్రభుత్వంలో ప్రకటనలకే పరిమితం

గత వైసీపీ ప్రభుత్వంలో డ్రోన్‌ల వినియోగం కేవలం ప్రకటనలు, ఆర్భాటాలకే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతంలో ఎంపిక చేసిన డ్రోన్ పైలట్లను సైతం రాజకీయం చేసి ఎలాంటి అర్హత లేని వారిని ఎంపిక చేసి, శిక్షణ పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది. ఎంపిక చేసిన గ్రూపులకు బ్యాంకర్‌ల నుంచి ఎలాంటి రుణ సదుపాయం కల్పించలేదు. దీంతో డ్రోన్‌ల వినియోగంపై రైతుల్లో అయోమయం నెలకొంది. కొన్నాళ్లకు ఆ ఊసే లేకుండా పోయింది.

నంద్యాల జిల్లాకు 40 డ్రోన్‌లు మంజూరు

జిల్లాలో మొత్తం 28 మండలాలు ఉండగా ప్రభుత్వం 40 డ్రోన్‌లను మంజూరు చేసింది. అందులో అవుకు, సంజామల, శిరువెళ్ల, ఆత్మకూరు మండలాలకు ఒక్కో మండలానికి రెండు డ్రోన్‌లను మంజూరు చేశారు. మిగిలిన డ్రోన్‌లను ఒక్కో మండలానికి ఒక్కటి కేటాయించారు. మరో 8 డ్రోన్‌లు ఉండగా ఎవరైనా ముందుకు వస్తే విచారించి కేటాయిస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గతంలో 30మంది పైలట్‌లుగా శిక్షణ పొందగా ప్రస్తుతం వారి నుంచి అన్ని అర్హతలు, సామర్థ్యం కలిగిన 13 మంది నిరుద్యోగ యువ కులను వ్యవసాయాధికారులు ఎంపిక చేశారు. మిగిలిన 27 మంది పైలట్‌లను ఎంపిక చేసి 10 రోజుల శిక్షణ అందించేం దుకు సిద్ధమయ్యారు. అనంతరం 80శాతం సబ్సిడీతో ఎనిమిది లక్షలకు తక్కువ కాకుండా ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనున్నారు.

మార్చిలోపు డ్రోన్‌ల పంపిణీ పూర్తి చేస్తాం



మార్చిలోపు డ్రోన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలియజేసి వారి పెట్టుబడులను తగ్గించేలా కృషి చేస్తున్నాం. అందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందుతోంది. త్వరలో రైతుల పంటలపై డ్రోన్‌లు ఎగురబోతున్నాయి.

- మురళీకృష్ణ, నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి

కూటమి ప్రభుత్వం
కులగణన చేపట్టాలి

- తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం
- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహయాదవ్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శమని, మన రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం కులగణన చేపట్టి దామాషా ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన వల్ల ఎవరి జనాభా ఎంత ఉందో తేటతెల్లమైందన్నారు. దేశంలో కూడా ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ కులగణన చేపట్టాలన్నారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలు తీవ్రంగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీలో కూడా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చొరవ తీసుకుని కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలు, 17 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు అంటే దాదాపు 90 శాతం వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలే ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తుంటే బీజేపీ మాత్రం రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పఠాన్‌అబూఖాన్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వద్ద కలకలం

- రైతు దగ్గర ఏటీఎం కార్డు కాజేసి రూ.40 వేలు డ్రా
- వృద్ధురాలి కవర్‌ను కత్తిరించి రూ.50 వేలు చోరీ


బాధితుడి వెనకవైపు నిల్చున్న నిందితుడు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంకు దగ్గర బుధవారం చోరీల కలకలం రేగింది. ఓ రైతు డబ్బు డ్రా చేసుకునేందుకు రాగా ఓ అగంతకుడు రైతును మాటల్లో పెట్టి ఏటీఎం కార్డును తస్కరించి మరో బ్యాంకులో రూ.40 వేలు డ్రా చేసుకున్నాడు. అదే బ్యాంకు వెనుక వైపు ఉన్న ఎస్‌బీఐ ఏడీబీ శాఖలో వృద్ధురాలు డబ్బు డ్రా చేసుకొని బయటకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి చాకచక్యంగా నగదు ఉంచుకున్న కవర్‌ను కత్తిరించి రూ. 50 వేలు కొట్టేశాడు. వివరాలు ఇలా.. పట్టణంలోని స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ ఏటీఎం సెంటర్‌లో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పెద్దకడు బూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన రైతు సత్యన్న ఏటీఎంలో డబ్బును డ్రా చేసుకునేందుకు వచ్చాడు. అప్పటికే ఏటీఎం సెంటర్‌లో ఉన్న ఓ అగంతకుడు రైతు సత్యన్న ఏటీఎం కార్డు తీసుకొని డబ్బు డ్రా చేసి ఇస్తున్నట్లు నటించాడు. డబ్బు రావటం లేదని రైతును ఏమార్చి కార్డును మార్చేశాడు. అనంతరం రైతు కార్డుతో ఉడాయించాడు. అగంతకుడు ఇచ్చిన కార్డును మరోసారి డబ్బును డ్రా చేసేందుకు ప్రయత్నించి డబ్బు రాకపోవటంతో బయటకు వచ్చాడు. వెంటనే సత్యన్న సెల్‌కు రూ.40 వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావటంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమన్నాడు. పోలీసులకు, బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పెద్దకడుబూరు మండలం హెచ్ మురవణి గ్రామానికి చెందిన వృద్ధురాలు బెనకమ్మ ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకులో రూ. 50 వేలు డ్రా చేసి, సంచిలో డబ్బును ఉంచుకొని వస్తుండగా సంచి బరువు తగ్గినట్లు అనిపించింది. సంచిని తెరచి చూడగా డబ్బు కనిపించలేదు. సంచి ఓ పక్క చిరిగి ఉండటంతో డబ్బు ఎక్కడైనా పడిందేమోనని బ్యాంకులో వెతికింది. ఎక్కడా కనిపించకపోవటంతో బోరుమంది. తనకు న్యాయం చేయాలని కోరుతోంది. ఒకే రోజు రెండు సంఘటనలు చోటు చేసుకోవటంతో ఖాతాదారులు ఉలిక్కిపడ్డారు. రైతు సత్యన్న ఏటీఎం కార్డు చోరీపై కేసు నమోదు చేశామని, వృద్ధురాలు పోగొట్టుకున్న డబ్బుపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు

రచ్చుమర్రి చోరీ కేసులో దొంగ అరెస్టు

- 47 తులాల బంగారు ఆభరణాలు, కేజీ వెండి, రూ.2.50 లక్షల స్వాధీనం


నిందితుడిని చూపుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన మురారి శేషాద్రి శెట్టి ఇంట్లో జరిగి దొంగతనం కేసులో అదే గ్రామానికి చెందిన బోయ దొండు నాగేంద్ర అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్‌లు తెలిపారు. బుధవారం మాధవరం పోలీస్ స్టేషన్‌లో దొంగను పట్టుకుని అరెస్టు చేసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెల 18వ తేదీన శేషాద్రి ఇంటో జోరీ జరిగిన విషం తెలిసిందే. దీంతో బాధితుడు మాధవరం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేపట్టారు. బోయే నాగేంద్ర దొంగ అని తేలడంతో బుధవారం మాధవరం సమీపంలో అరెస్టు చేశారు. రూ.32.90 లక్షల ఆభరణాలు, వెండి విలువ రూ.ఒక లక్ష విలువైన వెండి, నగదు రూ.2.50 లక్షలు సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పది రోజుల్లోనే కేసును ఛేదించడంతో సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్, సిబ్బందికి రివార్డులు అందజేశారు. మాధవరం, మంత్రాలయం పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి నగదు పురస్కారాన్ని అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ వీరేష్, గురుమూర్తి, వీరాంజనేయులు, సోమశేఖర్, విజయకుమార్, రఘు, రామకృష్ణ పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో
ఐదేళ్ల జైలు శిక్ష

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం తేవాలని నిత్యం భార్యను భర్త వేధిస్తుండడంతో వేధింపులు తట్టుకోలేక ఉరి వేసుకుని భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో భర్తపై నేరం రుజువు కావడంతో ఆళ్లగడ్డ ఐదో జిల్లా అదనపు జడ్జి బుధవారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన దూదేకుల కమాల్ దూదేకుల దస్తగిరమ్మను 2013లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అనంతరం అదనపు కట్నం తేవాలని నిత్యం భార్య దస్తగిరమ్మను కమాల్ వేధిస్తుండేవాడు. వేధింపులు తట్టుకోలేక 2016లో ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కోవెలకుంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు ఆళ్లగడ్డ కింది కోర్టులో విచారణ జరిపించారు. భర్తపై నేరం రుజువు కావడంతో జడ్జి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కమాల్ ఆ తీర్పును అంగీకరించకుండా ఆళ్లగడ్డ ఐదో జిల్లా అదనపు జడ్జికి అప్పీలు చేసుకున్నారు. అక్కడ కూడా కింది బెంచ్ జడ్జి విధించిన తీర్పునే ఆయన ఇచ్చారు. బుధవారం నిందితుడు హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణనాయక్ కడప సెంట్రల్ జైలుకు అప్పగించి వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీశైలం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం

ఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో చేపడుతున్న విద్యుద్దీకరణ పనుల్లో బుధవారం అపశ్రుతి చోటుచేసుకుంది. బోయ కృష్ణ(26) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా రామాపురం గ్రామానికి చెందిన బోయ కృష్ణ.. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో విద్యుత్ లోడ్ పెంచేందుకుగాను పోల్ టు పోల్ విద్యుత్ తీగలను మార్చే పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో దేవస్థానం ఆసుపత్రి వద్ద స్తంభం ఎక్కగా అక్కడ విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో స్తంభం పైనే ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. సహచర సిబ్బంది నిచ్చెన సాయంతో కింది దించి దేవస్థానం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసినప్పటికీ దేవస్థానం జనరేటర్ నుంచి రిటర్న్ సప్లై వల్ల విద్యుత్ సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంలో అటు దేవస్థానం అధికారులు, ఇటు విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం లేకుండా ఎవరికి వారు తప్పు తమది లేదని సమర్థించుకోవడం గమనార్హం. కేసు నమోదు చేసుకున్న శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులు దేవస్థానం, విద్యుత్‌శాఖ అధికారులను పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

కుక్క కాటుతో బాలుడి మృతి


మొహిద్దీన్ (ఫైల్)

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ గ్రామానికి చెందిన జిలానీ బాషా, రసూల్‌బీ దంపతులకు కుమారుడు మొహిద్దీన్ (12) బాలుడు కుక్క కాటుకు గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాలివీ.. కాల్వబుగ్గ గ్రామంలో జనవరి 9వ తేదీన తన ఇంటి వద్ద ఆడుకుంటుండగా.. కుక్క బాలుడి కాళ్లకు కరిచింది. దీంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే కోలుకోలేక మృతి చెందాడు.

కొండముచ్చు దాడిలో ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద కొండముచ్చు మనుషులపై దాడి చేస్తుండటంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం సంజామల మండల రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దస్తగిరి కొలిమిగుండ్ల సర్కిల్ వద్ద లారీ ఆపుకొని భోజనం కోసం హోటల్‌కు వెళ్తుండగా కొండ ముచ్చు దాడి చేసింది. దీంతో దస్తగిరి ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా 20కుట్లు పడ్డాయని స్థానికులు తెలిపారు. అక్కడే చిరుదుకాణం నిర్వహిస్తున్న లక్ష్మీదేవమ్మ అనే మహిళపై కూడా దాడి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని కొండ ముచ్చును పట్టుకుని తరలించాలని కోరుతున్నారు.



గాయపడ్డ దస్తగిరి, దాడి చేసిన కొండముచ్చు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ఓ జీపు ఢీ కొన్న ఘటనలో జీపు డ్రైవర్‌తో పాటు, ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. బుధవారం తాడిపత్రి నుంచి జమ్మలమగుడుకు వెళ్తున్న జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, ట్రాలీ వాహనం ఢీకొనడంతో ట్రాలీ వాహనంలో ప్రయాణిస్తున్న అవుకు గ్రామానికి చెందిన దూదేకుల బుచ్చమ్మ, దూదేకుల బుజ్జి మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన బస్సు

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని రైతు ఉప్పరి నాగరాజు (41) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. గూడూరు పట్టణానికి చెందిన రైతు ఉప్పరి నాగరాజు ఐదెకరాలను కౌలుకు తీసుకుని కంది పంటను సాగు చేశాడు. అయితే వేసిన పంట పండకపోవడంతో నష్టం వాటిల్లింది. దాదాపు రూ.5 లక్షల అప్పులయ్యాయి. ఎలా తీర్చాలో తెలియక మదనపడుతూ గత రెండు రోజులుగా కనిపించకుండా పోయాడు. బుధవారం గూడూరు పట్టణంలోని పడమర బీసీ కాలనీ సమీపంలోగల గోడౌన్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సమాచారాన్ని పోలీసులకు అందించారు. ఎస్ఐ తిమ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుని తండ్రి ఉప్పర నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

వై. కానాపురంలో ఇరువర్గాల ఘర్షణ

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వై. కానాపురం గ్రామంలో పొట్టేళ్ల తలకాయల కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మంగళవారం గ్రామంలో ఒక వర్గం వారు సుంకులమ్మ అమ్మవారి దేవర చేశారు. అయితే.. బుధవారం పొట్టేళ్ల తలకాయల కోసం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య వై.కానాపురం చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘర్షణ చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ఘర్షణపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

సేవా దృక్పథంతో మెలగాలి

- సత్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి
- శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు


మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బహ్మోత్సవాల నేపథ్యంలో క్షేత్రానికి తరలివచ్చే భక్తుల పట్ల ఆయా సత్రాల వారు సేవా దృక్పథకంతో మెలగాలని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శ్రీశైలంలో ఆయా సత్రాల నిర్వాహకులతో ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సత్రాల వారు కూడా సేవా దృక్పథంతో భక్తులకు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇందుకు దేవస్థానం తరఫున కూడా సహకారం అందిస్తామని చెప్పారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరం కలిగే అవకాశం ఉందని, ఇందుకు గానూ ముందుగానే అవసరమైన సరుకులు, ఇతర వస్తువులను సమకూర్చుకోవాలని తెలిపారు. అలాగే అన్ని సత్రాలు శుచిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సత్రాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలను వాడాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపర్చుకుని నీటి నిల్వలు ఉంచుకోవాలన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, దేవస్థానం అధికారులు ఉన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు ఉండాలి

● ఉద్యోగులకు కలెక్టర్ సూచన


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజలు ఎంతో నమ్మకంగా ఉంటారని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలపట్ల అనుకూల దృక్పథం, సత్సంబంధాలు కలిగి ఉండాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్, పాజిటివ్ థింకింగ్‌పై జిల్లా అధికారులకు ఉద్యోగులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి లైఫ్ కోచ్ మోటివేషన్ స్పీకర్ డాక్టర్ ఎస్.రాంబాబు వ్యవహరించారు. డీఆర్వో రామునాయక్, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ లీలావతి తదితరులు హాజరయ్యారు. డాక్టర్ ఎస్. రాంబాబు మానసిక, శారీరక ఒత్తిడి తగ్గించుకునే అంశాల గురించి వివరించారు.

నంద్యాల ఎడ్యుకేషన్: ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు నిర్దేశించిన లక్ష్యంలో పెండింగ్‌లో ఉన్న 17 లక్షల పనిదినాలను మార్చి 31వ తేదీలోపు పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డ్వామా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బేతంచర్ల, కొత్తపల్లి, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, బండిఆత్మకూరు తదితర మండలాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో వెనుకబడి ఉన్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వామా ఇన్‌చార్జి పీడీ భాస్కర్‌నాయుడు, జిల్లాపరిశ్రమల మేనేజర్ జవహర్‌బాబు పాల్గొన్నారు.

'రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలి'


నంద్యాలలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక, కర్షక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధ వారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ బేగంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, నాయకులు మహమ్మద్‌గౌస్, బాలవెంకట్, నరసింహ, వెంకటలింగం పాల్గొన్నారు.

ఆత్మకూరు: కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా సంఘాల నాయకులు రామ్‌నాయక్, రణధీర్, పెద్దనాగరాజు, మల్లయ్య, రాజు, సామేలు, సువర్ణమ్మ, భారతి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

వెలుగోడు: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసగౌడుకు వినతిపత్రం అందజేశారు. నాగమోహన్, కిశోర్, కృష్ణ, నబీ రసూల్, మోదీన్‌వలి పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

మహానంది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈనెల 22 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాటు పనులను ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. బుధవారం సాయంత్రం మహానంది ఆలయ పరిసరాల్లోని పలు పరిసరాలను పరిశీలించారు. వీరి వెంట ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం

ఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కబడీపోటీల్లో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతులను ప్రదానం చేసినట్లు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టుకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన వడ్డెమాను జట్టుకు రూ.5వేలు,మూడో స్థానంలో నిలిచిన వెంకటాపురం జట్టుకు రూ.3వేలు, నాలుగో స్థానంలో నిలిచిన ప్రాతకోట జట్టుకు రూ.1000 నగదు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. ఈ బహుమతులను రైల్వే వాలీబాల్ కోచ్ నిమ్మి కృష్ణ, టీడీపీ నాయకులు రేడియం నూర్, తైక్వాండో గౌరవాధ్యక్షులు సయ్యద్‌అసదుల్లా చేతుల మీదుగా అందజేసినట్లు చెప్పారు. కాగా వేసవి సెలవుల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బాడ్మింటన్, షటిల్, బాక్సింగ్, తైక్వాండో టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా క్రీడలకు 12 నుంచి 18ఏళ్ల వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

సున్నిపెంట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలోని డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్స వాల్లో భాగంగా 'రహదారి భద్రత ప్రచారం.. శ్రద్ధ వహించండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ హుస్సేన్ బాషా, అధ్యాపకులు బుచ్చయ్య, పద్మ, రాజన్న మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'పరిశోధనల్లో భాగం కావాలి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉన్న ప్రతి ఒక్క అధ్యాపకుడు తప్పకుండా పరిశోధనల్లో భాగం కావాలని శ్రీ రామకృష్ణా విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ రామకృష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి సూచించారు. నంద్యాల శ్రీ రామకృష్ణా విద్యాసంస్థల్లో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి ఎంఫిల్ డిగ్రీ పొందిన సందర్భంగా కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

'సేవా దృక్పథం అలవర్చుకోవాలి'


మాట్లాడుతున్న పొదిలి నారాయణ

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నేటి యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీఐ నారాయణ రెడ్డి, షేర్ ద విజన్ సంస్థ పొదిలి నారాయణ సూచించారు. ఆత్మకూరు మండలంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీలోని మానవతా నిలయం వృద్ధాశ్రమానికి షేర్‌ద విజన్ సంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో బుధవారం రూ.3 లక్షల విలువ గల వంట సామగ్రి, బెడ్స్, నిత్యావసర వస్తువులు, ఫ్యాన్లు, గ్రీజర్లు, దుప్పట్లు, వృద్ధులకు నూతన వస్త్రాలను వారు ముఖ్య అతిథులుగా హాజరై అందజేశారు. నారాయణ మాట్లాడుతూ వృద్ధులకు బాల బాలికలకు, అనాథలకు సేవ చేయడమే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తోందని చెప్పారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు యుగంధర్, దుద్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు

● ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్న వైనం



నందిపల్లి సమీపంలోని పొలాల్లో అక్రమంగా తవ్విన దృశ్యాలు

మహానంది, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మహానంది మండలం నందిపల్లి సమీపంలోని భూముల్లో కొందరు అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామ సమీపంలోని పొలాల్లో ఎక్సవేటర్ సహాయంతో మట్టిని తవ్వి బహిరంగగానే ట్రక్కులో తరలిస్తున్నారు. అలాగే మహానంది-రుద్రవరం మండలాల సమీపంలోని సరిహద్దు ప్రాంతంలోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో కొందరు రాజకీయ అండతో ఎర్రమట్టిని తవ్వి మండలంలోని గాజులపల్లి మీదుగా నంద్యాలకు ట్రక్కుల సాయంతో రాత్రివేళల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులు అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర తెలిపారు. 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి వేసవికాలం దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పంచాయతీలకు చేతిపుంపులు, పరికరాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలానికి 120 పైపులు, 10 కొత్తబోరింగ్‌ల హెడ్లు వచ్చినట్లు చెప్పారు. చేతిపంపులు మరమ్మతులకు గురైతే రిపేరీ చేయిస్తామని చెప్పారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

వెలుగోడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణ శివారులోని తెలుగుగంగ డీఎల్‌బీ రెగ్యులేటర్ సమీపంలో బుధవారం మాధవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి బాలయ్య గౌడ్(70) ఆత్మహత్య చేసుకున్నారు. తెలుగుగంగ డీఎల్‌బీ రెగ్యులేటర్ సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని శవపరీక్షా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ షాషావలి తెలిపారు.

నిందితుల కోసం గాలింపు

గడివేముల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనంగా మారిన పాణ్యం మండల పరిధిలోని, నంద్యాల పట్టణ పరిధిలోని దారి దోపిడీ కేసులలో నిందితుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు బండిఆత్మకూరు మండలంలోని పరమటూరు, గడివేముల మండల పరిధిలోని కరిమద్దెల గ్రామాల సరిహద్దులోని వంకలలో స్థావరాలు ఏర్పరుచుకొని ఉన్నారన్న సమాచారం రావడంతో బుధవారం నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలోని 30 మంది పోలీసులు ముమ్మరంగా గాలించారు. పోలీసుల అలికిడి గమనించిన నిందితులు వారి నుంచి తప్పించుకునేందుకు ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంటలోకి వెళ్లి దాక్కున్నారు. దీంతో పోలీసులు డ్రోన్ కెమెర సహాయంతో పంట పొలంలో గాలింపు చేపట్టారు. ఈ గాలింపు చర్యలలో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్, గడివేముల ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ మారుతి శంకర్ సూచించారు. వెలాసిటీ జూనియర్ కాలేజీలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ క్రైమ్ సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియాపట్ల, మహిళల భద్రత, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వెలాసిటి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం తథ్యం: డీఈవో


గాజులపల్లిలో మాట్లాడుతున్న డీఈవో

మహానంది, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో విజయం సాధిస్తారని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాజులపల్లి, గోపవరం గ్రామాల్లోని జడ్పీ పాఠశాలలను బుధవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయిలకు విద్యా బోధనపై పలు సూచనలు ఇచ్చారు. పది ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, రమణమ్మ పాల్గొన్నారు.

'భారతీయ సంస్కృతిని అనుసరించేలా ప్రోత్సహించాలి'

పాణ్యం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించేలా ప్రోత్సహించాలని ఆర్ఎస్ఎస్ ఏపీ కార్యదర్శి జనార్దన్ సూచించారు. బుధవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో భారతీయ వారసత్వం, సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భారతీయ చారిత్రక ప్రామాణికత, ఆధునిక కాలంలోని ప్రాసంగికతపై జనార్దన్ వివరించారు. అలాగే జ్ఞానం, విలువలు, సాంకేతిక అభివృద్ధి యువతకు ఎలా మార్గనిర్దేశం చేస్తాయో వివరించారు. అనంతరం కళాశాల సిబ్బంది జనార్దన్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు, కళాశాల కౌన్సిలర్ డాక్టర్ నరసింహులు, పాల్గొన్నారు.

'సమయాన్ని వృథా చేసుకోవద్దు'

నంద్యాల ఎడ్యుకేషన్/రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి, పోటీ పరీక్షల నిపుణుడు దాసు సూచించారు. నంద్యాల ప్రతిభా కోచింగ్ సెంటర్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఎస్సీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో దారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీవైఎఫ్ఐ నాయకులు రామన్న, శివ, మధుశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ జట్టు కోచ్ మేనేజర్లుగా ఎంపిక

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఈనెల 10 నుంచి 14 వరకు జరిగే 19వ బాలుర జాతీయ ఫెన్సింగ్ క్రీడల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్ మేనేజర్‌లుగా నంద్యాల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. గడివేముల మండలం గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజకల్ డైరక్టర్ కవిత, బనగానపల్లె మండలం నందివర్గ జడ్పీ ఫిజికల్ డైరక్టర్ వెంకటసురేష్, నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రాణెమ్మను కోచ్ మేనేజర్‌లుగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పీఈటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్యాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భుజంగరావు, విశ్వనాథ్ అభినందించారు.

ఉత్సవాల ప్రత్యేకాధికారిగా రామాంజనేయులు

మహానంది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేకాధికారిగా ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి స్వామి ఆలయ ఈవో రామాంజనేయులును నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మద్దిలేటిస్వామి ఆలయ ఈవోను మహానంది ఉత్సవాల ప్రత్యేకాధికారిగా నియమిస్తూ దేవస్థానం కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు.

చెంచు గూడేల్లో పోలీసుల తనిఖీ

సునిపెంట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు చెంచు గూడేల్లో ఆకస్మిక తనికీలు నిర్వహించారు. ఈ గూడాలలో ఉన్న చెంచులు నాటుసారా విక్రయించటం, సేవించటం నిషేంధిచినట్లు హెచ్చరించారు. అలాగే భక్తులను విల్లంబులతో భయబ్రాంతులకు గురిచెస్తునట్లు తెలిసి వాటిని స్వాధీనం చేసుకునారు. అటవీశాఖ రేంజర్ సుభాష్, 30 మంది పోలీసులు ఉన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆయన సోదరుడు ఫయాజ్‌లు బుధవారం నంద్యాలకు చెందిన జాతీయ క్రికెటర్ ఎస్ఏ అక్బర్‌ను సన్మానించారు. ఇటీవల ఆగ్రాలో జరిగిన ఆల్ ఇండియా జాతీయ టీ-20 క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో అక్బర్ రన్నర్స్‌గా నిలిచిన టీమ్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా అక్బర్‌ను ఫిరోజ్‌తో పాటు ఆయ సోదరుడు టీడీపీ నాయకుడు ఫయాజ్‌లు వేర్వేరుగా జిల్లా టీడీపీ కార్యాలయంలో సన్మానించారు.

శ్రీశైల జలాశయంలో 853.8 అడుగుల నీటి మట్టం

ఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయంలో బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 852.2 అడుగుల నీటి మట్టం నమోదైంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 852.2 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. అదే క్రమంలో ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వలు 215.8070 టీఎంసీలకు గాను ప్రస్తుతం 85..0245 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. కాగా ప్రాజెక్టు నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి 35,315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇదిలావుంటే ఉదయం 6 గంటలకు తెలంగాణ పవర్ హౌస్ 6004 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 1585 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు 2400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడుకు 2146 క్యూసెక్కులు, నీటి ఆవిరి రూపంలో 254 క్యూసెక్కుల చొప్పున మొత్తం 12,389 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. అయితే సాయంత్రానికి తెలంగాణ పవర్ హౌస్‌కు 35,315 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మిగతా ప్రాజెక్ట్‌లకు నీటి నిల్వలను పూర్తిగా నిలిపివేశారు.

అధికారులను కలిసిన సభ్యులు

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు నవీన్‌తో పాటు బాలనాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, వెంకటేష్ నాయక్, మురళి బుధవారం అధికారులను కలిశారు. కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, డీఆర్వో రామునాయక్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణిలను మర్యాద పూర్వకంగా కలిశారు.

అడవి బిడ్డల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


శివపురం గూడెంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అడవిలో ఉంటూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోని అడవి బిడ్డల ఆరోగ్య సంరక్షణే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని శివపురం గిరిజనగూడెంలో బుధవారం నూతన హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. శ్రీశైలం ఐటీడీఏ డీఈ రియాజుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో పీవీటీజీ మిషన్ కింద సీసీడీపీ గ్రాంట్ ద్వారా రూ.55 లక్షలతో శివపురం గూడెంలో హెల్త్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, నారపురెడ్డి, లింగస్వామి గౌడు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, సహదేవుడు, రవీంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, మోహన్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు విస్తరణ పనులను త్వరితగతిన పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే జయసూర్య అధికారులను ఆదేశించారు. బుధవారం పోతిరెడ్డిపాడు విస్తరణ పనుల్లో భాగంగా లైనింగ్, స్టాండెడ్ బ్యాంకు పనులను పరిశీలించారు. పెండింగ్‌పనులన్నీ పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈఈ పార్థసారథి, డీఈ నాగేంద్రకుమార్, సుబ్రమణ్యంరెడ్డి, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. వేంపెంట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. సర్పంచ్ మాణిక్యమ్మ, ఎంపీటీసీ రామసుబ్బమ్మ, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నాయకులు రాజేష్, లెనిన్ బాబు, మోహన్‌గౌడ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యా సామగ్రిని అందజేసిన ఫిరోజ్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవజీవన్ మూగ చెవిటి పాఠశాల విద్యార్థులకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం పాఠశాల ప్రతినిధులకు కిట్లు అందజేశారు. ఫిరోజ్ మాట్లాడు తూ నవజీవన్ పాఠశాలకు సహాయం చేస్తానని గతంలో ఇచ్చిన హామీ మేరకు తాను స్కూల్ కిట్లు పంపిణీ చేశానని చెప్పారు. మూగ చెవిటి విద్యార్థుల కోసం స్కూల్ కిట్లు పంపిణీ చేసిన ఫిరోజ్‌కు పాఠశాల ఉద్యోగి మహబూబ్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'లైసెన్స్ తప్పనిసరి'


వ్యాపారి నుంచి సెస్ వసూలు చేస్తున్న మార్కెటింగ్ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దాల్‌మిల్స్ వ్యాపారులందరూ మార్కెట్ కమిటీ లైసెన్సను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ మేనేజర్ కల్పన ఆదేశించారు. నంద్యాల పట్టణంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ కల్పన వారి బృందంతో దాల్‌మిల్స్‌ను తనిఖీ చేసిన అనంతరం వ్యాపారులు వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెల్లించాల్సిన మార్కెట్ సెస్ రూ.5,85,000ను వసూలు చేశారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌కు చెల్లించాల్సిన సెస్‌ను తప్పనిసరిగా చెల్లించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'అధికారులు అలసత్వం వీడాలి'


మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అధికారులు విధుల పట్ల అలసత్వం వీడాలని మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. బుధవారం బండిఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో దస్తగిరి ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పలువు అధికారుల గైర్హాజరు, వచ్చిన వారు ఆలస్యంగా సమావేశానికి రావటంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం పలు శాఖల మండల స్థాయి అధికారులు ప్రగతిని నివేదించారు. తహసీల్దార్ పద్మావతమ్మ, ఏఈలు లక్ష్మీనరసింహ, వెంకటరాముడు, వాసుదేవుడు, డాక్టర్లు సవిత, అనూష, ఏపీఎం రామశేఖర్‌రెడ్డి, ఏపీవో వసుధ, ఈవోపీఆర్డీ రామకృష్ణ వేణి, ఏవో శ్యామల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'నంద్యాల శనగ 776'తో అధిక దిగుబడి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల శనగ 776 (ఎన్‌బీఈజీ) అధిక దిగుబడి ఇస్తుందని ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో బుధవారం పులిమద్ది గ్రామంలో నంద్యాల శెనగ 776 క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలభారత సమన్వయ పరిశోధన సంస్థ ప్రణాళికలో భాగంగా ప్రథమశ్రేణి క్షేత్రాలులో భాగంగా శెనగను 15 మంది రైతులతో 15 ఎకరాలలో సాగు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం శనగ పంట పంటకోత దశలో ఉన్నట్లు గమనించామన్నారు. మొక్కకు 80 నుంచి 90 కాయలు వచ్చినట్లు తెలిపారు. 776 రకం అధిక దిగుబడితో పాటు, ఎండు తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుని వర్షాధారంతో 7-8 క్వింటాలు, ఒకటి లేదా రెండు నీటి తడులతోనైతే 10-12 క్వింటాల దిగుబడి వస్తుందని తెలిపారు. కాబట్టి జెజి 11 రకానికి ప్రత్యామ్నాయంగా నంద్యాల శెనగ776 సాగు చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ నీలిమ, శివరామకృష్ణ పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం'




నందికొట్కూరు, ఆత్మకూరులో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు దగ్గర నిరసన చేపట్టారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకుడు బెస్త రాజు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, బడుగు బలహీన వర్గాలకు ఏ మాత్రం ఊరటనివ్వని కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు పక్కీర్ సాహెబ్, కర్ణ, ఓబులేసు, ఉస్మాన్‌బాషా, జయరాణి పాల్గొన్నారు.

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేశారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం ఆరోపించారు. బుధవారం ఆత్మకూరుతో పాటు కురుకుంద, వడ్లరామాపురంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వివిధ సంఘాల నాయకులు మాబాషా, వీరన్న, రామ్‌నాయక్, రణధీర్, వెంకటేశ్వర్లు, సామేలు ఉన్నారు.

బండిఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని సీఐటీయూ నాయకులు రత్నమయ్య, రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏసేపు, రమేష్‌లు అన్నారు. బుధవారం మండలంలోని శింగవరం గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కనకరాజు, రత్నం, పెద్దయ్య పాల్గొన్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేయండి



దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోరారు. బుధవారం దేవదాయశాఖమంత్రితో మంత్రి బీసీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పడండి



సీఎం చంద్రబాబునాయుడుకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని సీఎం చంద్రబాబునాయుడును కోరినట్లు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బుధవారం కలిశారు. నియోజక వర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీఎంకు విన్నవించామని అన్నారు.

డీజీపీని కలిసిన గోగిశెట్టి నరసింహారావు

శిరివెళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని పలు అంశాలపై డీజీపీ మాట్లాడినట్లు నరసింహారావు తెలిపారు.

నల్లమలలో వన్యప్రాణుల గణన పూర్తి

రుద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలో భాగంగా రుద్రవరం రేంజ్‌లో వన్యప్రాణుల గణన పూర్తయిందని రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. ప్రతి బీట్‌లో కాలినడకన నడిచి సిబ్బంది వన్యప్రాణుల పాదముద్రలు ఇతరవాటిని గుర్తించామని తెలిపారు.ఎన్‌టీసీఏ ఆధ్వర్యంలో శాఖాహారం, మాంసాహారం, వన్యప్రాణుల గణాంకాలు పూర్తయ్యాయన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నల్లమల అటవీ తీర గ్రామాల్లో ఎప్పటికప్పుడు నిఘా పెట్టామన్నారు. వన్యప్రాణులసంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి : డీఈవో

శిరివెళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మహదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు అనుసరిస్తున్న ప్రణాళికను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను డీఈవో పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డీటీ శంకర్ ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

బనగానపల్లె ,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలో నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తున్నట్లు ఈవో చంద్రుడు బుధవారం తెలిపారు. యాగంటిలో ఈనెల 25 నుంచి మార్చి 1వతేదీ వరకు నిర్వహించే యాగంటి శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఈవో కోరారు.

వాట్సాప్‌తో రూముల బుకింగ్

● ఉప కమిషనర్ రామాంజనేయులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంశివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో రూం బుకింగ్ చేసుకోవడానికి భక్తుల సౌకర్యార్థం వాట్సాప్ నెంబరు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు బుధవారం తెలిపారు. రూం బుకింగ్ కోసం 8333907851 అనే నెంబర్‌కు పూర్తి వివరాలు నమోదు చేసి వాట్సాప్ చేయాలన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

డోన్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. సుంకయ్య, డోన్ పట్టణ కార్యదర్శి బలరాముడు, మోటరాముడు అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో పేద ప్రజలతో దరఖాస్తులు తీసుకునే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, షరీన్, శ్రీరామ్‌నగర్ కార్యదర్శి బాలమద్దయ్య, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బనగానపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9 తరగతుల్లో మెరిట్ సాధించిన పదో తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు మొత్తం రూ.3లక్షల నగదు ప్రోత్సాహకాలు బుధవారం జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం అందించింది. ప్రతి పాఠశాలనుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి నగదు బహుమతులు అందించింది. కార్యక్రమంలో యూనిట్‌హెడ్ గురివిరెడ్డి, హెచ్‌ఆర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల విలీన యోచన సరికాదు

ప్యాపిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విలీన యోచనను విరమించుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంగళాంపల్లి కేతుకే నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షకుర్ హుస్సేన్‌కు ప్రజలు వినతి పత్రం అందజేశారు.

రహదారి పనులకు సహకరించాలి

● నందవరం మీదుగా భారీ వాహనాల మళ్లింపు

బనగానపల్లె ,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప గ్రామంలో సిమెంట్ రోడ్డు వేస్తున్నందున భారీ వాహనాలు నందవరం మీదుగా నంద్యాలకు వెళ్లాలని టీడీపీ కైప నాయకుడు రఘునాథరెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కైప గ్రామంలో ప్రధాన రహదారిలో సిమెంట్ రోడ్లు వేస్తున్నారని, భారీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. సిమెంట్ రోడ్డు పూర్తయ్యే వరకు బనగానపల్లె నుంచి పండ్లాపురం, వెంకటాపురం మీదుగా నంద్యాలకు వాహనాలు వెళ్లాలని ఆయన కోరారు. అలాగే నందవరం మీదుగా నంద్యాలకు వెళ్లాలని ఆయన కోరారు.

మోదం.. ఖేదం

- కోతకు వచ్చిన శనగ పంట
- రూ. 400 వెచ్చించినా దొరకని కూలీలు
- నేల రాలుతున్న శనగ పంట

కొలిమిగుండ్ల/సంజామల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న అన్నదాతలను వ్యవసాయ కూలీల కొరత వేధిస్తున్నది. పంటల కోతల సమయం కావడంతో మహిళా కూలీలకు డిమాండ్ ఏర్పడింది. సాగు చేసిన పంటల్లో అంతర్గత పనులు, మిరప, పత్తి పంటల కోతల్లో కూలీలు బిజీగా ఉన్నారు. ఇదే సమయంలో పప్పు శనగ పంట కోతలు మొదలు కావడంతో రైతులకు కూలీలు దొరకడం లేదు. రబీ సీజన్‌లో పప్పు శనగ సాగుదే అగ్రభాగం. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో లక్ష ఎకరాలకు పైగా రైతులు శనగను సాగు చేశారు. వారం రోజుల నుంచి అన్ని ప్రాంతాల్లో పంట నూర్పిడి పనులు ఆరంభమయ్యాయి. ఈ పరిస్థితుల్లో కూలీల కొరత వేధిస్తుండటం ఓ వైపు అయితే, మరో వైపు కూలి విపరీతంగా పెంచినట్లు అన్నదాతలు వాపోతున్నారు. మొన్నటి వరకు మహిళా కూలీలకు రోజు రూ.200 కూలి ఉండగా, ప్రస్తుతం రూ.300 నుంచి రూ.400వరకు చెల్లిస్తామన్నా కూలీలు దొరకడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అసలే దిగుబడి తగ్గిపోవడం, గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తున్న శనగ రైతులకు కూలీల కొరత, కూలి పెంపు మరింత అదనపు భారంగా మారింది. ఒక ఎకరాకు సుమారు 20మందికి పైగా కూలీలు అవసరమవుతుండగా రూ. ఎనిమిది వేలకు పైగా పంట నూర్పిడికే వెచ్చించాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. కాగా కూలి పెరుగుదల మహిళా కూలీలకు మోదం కాగా, అన్నదాతలకు ఖేదంగా మారింది.

సంజామల మండలంలో..

కూలీలు కొరత వేధిస్తుండటంతో చేతికి వచ్చిన శనగ పంట నేలరాలుతోంది. సంజామల మండలంలో 18000 హెక్టార్లలో రైతులు శనగ సాగు చేశారు. ఒకేసారిగా కోతలు రావడంతో కూలీల కొరత భారీగా తలెత్తింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నానికి రూ. 400 కూలి చెల్లించి పక్క మండలాల నుంచి కూలీలు పిలుస్తున్నారు. అయినా కూలీల కొరత వేధిస్తోంది. సాధారణంగా కూలీలతో కోత కోయించి హార్వెస్టర్లతో నూర్పిడి చేసేవారు. ప్రస్తుతం ఎకరానికి రూ. 1800 , రూ. 2000 వెచ్చించి ఒకేసారి కటింగ్ యంహార్వెస్టర్లతో పంట కోయిస్తున్నారు.



కొలిమిగుండ్లలో వ్యవసాయ పనులకు ఆటోల్లో వెళ్తున్న కూలీలు



సంజామలలో కూలీలు దొరకక ఎండిపోతున్న శనగ పంట

పది ఎకరాల్లో సాగు చేశాను



పది ఎకరాల్లో శనగ పంటను సాగు చేశాను. పంట కోతకు వచ్చింది. కూలీల కొరత వేధిస్తోంది. కూలీలకు మధ్యాహ్నం వరకు రూ.400 వెచ్చించి పంట కోత కోయించాను. నూర్పిడి చేయాల్సి ఉంది.

- చంద్రశేఖర్ రెడ్డి, సంజామల

హార్వెస్టర్లతో కోయిస్తున్నాను



నాలుగు ఎకరాల్లో శనగ పంటను సాగు చేశాను పంట కోత దశకు చేరుకుంది. కూలీలు దొరకడం లేదు. దాంతో ఎకరం కోతకు రూ. 2000 వచ్చించి హార్వెస్టర్లతో పంట కోత కోయించాను.

- శ్రీనివాస రెడ్డి, రైతు, కొత్త పేట

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ

బేతంచెర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం దేశ వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలో భాగంగా బేతంచెర్ల మండలంలో సీఐటీయూ కార్యాలయం నుంచి పాత బస్టాండు, కొత్తబస్టాండు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్‌కు అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్‌కు అనుకూలంగా మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్‌కే బాషా, ఎస్. ఖాజా, నారాయణరెడ్డి, జే.శ్రీని వాసులు, స్వామి నాయుడు, యు. హరిప్రసాద్, హుశేన్, లక్ష్మన్న, షేబా రాణి, నాగలక్ష్మి, రామలక్ష్మి, సుజాత, లక్ష్మీదేవి, రంగడు, గణమద్దిలేటి, పద్మావతి, తిమ్మయ్య, సాలయ్య టింగు, రాజబాబు పాల్గొన్నారు.

డోన్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

స్టెమీ చికిత్సతో గుండెకు భరోసా

డోన్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్టెమీ చికిత్స గుండెకు భరోసా కలిగిస్తుందని డోన్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎం హనీఫ్, స్టెమీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ముజామిల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉచితంగా వైద్యసేవలను నేడు ప్రభుత్వం అందిస్తున్న సంజీవని వంటి కానుక అన్నారు. ఎవరైనా గుండెపోటుకు గురైన మొదటి గంటలో వారికి అందించే చికిత్స ఎంతో కీలకమని తెలిపారు. గుండెపోటు లక్షణాలు ఛాతీ నొప్పి, ఎడమ బుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. గుండెనొప్పి వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లిన గంటలోనే రూ.45వేలు విలువ చేసే స్టెమీ టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో, ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.



గుండె చికిత్సను పరిశీలిస్తున్న వైద్యులు

అవగాహనతో ప్రమాదాలు నివారించొచ్చు

డోన్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని ఆర్టీవో క్రాంతి కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంచుకుంటే రోడ్డు ప్రమదాలను అరికట్టువచ్చునని తెలిపారు. విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్, ట్రిపుల్ రైడింగ్ వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో క్రాంతి కుమార్

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రైవేటు విద్య కన్నా అంగన్‌వాడీ కేంద్రాలలో చెప్పే ఆట, పాటల విద్యే మంచిదని స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆదాము తెలిపారు. ఈసీసీఈ దినోత్సవం సందర్భంగా మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఒత్తిడితో కూడిన విద్య ఉంటుందన్నారు. దీని వల్ల వారి మానసిక స్థితి సరిగా ఉండదన్నారు. అందువల్ల తల్లిదండ్రులు ఐదేళ్లలోపు చిన్నారులను తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అలాగే పాఠశాల నుంచి పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత వారు చెప్పే ప్రతిది ఓపికతో వినాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయరాదన్నారు. ఇది చట్టా రీత్యా నేరమన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతం చేశారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ అధికారి సరస్వతి, కార్యకర్తలు రాజేశ్వరి, ఫక్రుబీ, గురులక్ష్మి, కాశింబీ, మహిళలు ఉన్నారు.

పాముకాటుతో విద్యార్థి మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామానికి చెందిన ప్రణయ్‌కుమార్‌రెడ్డి(4) అనే విద్యార్థి బుధవారం రాత్రి పాముకాటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన రవి కుమార్‌రెడ్డి కుమారుడు ప్రణయ్‌కుమార్‌రెడ్డి చాగలమర్రి గ్రామంలోని ఓ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి వద్ద ఆడుకుంటుండగా పాము కాటుకు గురయ్యాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తరలిస్తుండగా విద్యార్థి మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

డోన్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బోయ ఎల్లయ్య (40) మంగళవారం ఉంగరానిగుండ్ల గ్రామ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన మృతికి లారీ మోటారు వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, శివరాం బుధవారం సంతాపం తెలిపారు. మృతుడి స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో వారు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతునికి భార్య కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బనగానపల్లె ,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన గౌరచిన్న ఆంజనేయులు(38) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య బుధవారం తెలిపారు. మృతుడి భార్య గౌరసుబ్బ నీలావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ : వ్యక్తికి తీవ్ర గాయాలు

శిరివెళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై కానాలపల్లె మెట్ట సమీపంలో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. శిరివెళ్ల పోలీసులు తెలిపిన వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్‌కు చెందిన నవీన్ అనే వ్యక్తి చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామంలోని బంధువుల వద్ద నుంచి బైక్‌పై నంద్యాల వైపు వెళ్తుండగా ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటనపై శిరివెళ్ల పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

గొంతువాపు వ్యాధితో గేదెలు, దూడలు మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో గొంతువాపు వ్యాధి సోకి 30 గేదెలు, దూడలు బుధవారం మృతి చెందాయి. గ్రామంలోని పలువురు రైతులకు చెందిన గేదెలు, దూడలు గొంతువాపు వ్యాధి ద్వారా మృతి చెందాయని రైతు చిన్న అంకాల్‌రెడ్డి, మరి కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యులు గొంతువాపు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కంటైనర్

ప్యాపిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాంపల్లి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న చెరువులోకి బుధవారం తెల్లవారు జామున కంటైనర్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు. బెంగుళూరు నుంచి హైదరాబాదుకు ఎక్స్‌కమేటర్ తీసుకొని కంటైనర్ లారీ బయలుదేరింది. మార్గం మధ్యలోని వెంగళాంపల్లి దగ్గరకు రాగానే వాహనం అదుపు తప్పి చెరువులోకి వెళ్లి దూసుకెళ్లింది. కాగా, కంటైనర్ కుదుపునకు గురికావడంతో లారీపై ఉన్న ఎక్స్‌కవేటర్ రోడ్డుపై పడింది. అయితే చెరువులో మరికొంత దూరం వెళ్లింటే వాహనం మునిగిపోయేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాడిరైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● పశువైద్యాధికారి కృష్ణకుమార్



కోవెలకుంట్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశువైద్యాధికారి డాక్టర్ క్రిష్ణకుమార్ అన్నారు. అందుకు గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందని, సబ్సిడీతో గోకులం షెడ్లు నిర్మిస్తుందన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని పశువైద్య శిబిరాలు నిర్వహించారు?

జవాబు : మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 17 పశువైద్య శిబిరాలు నిర్వహించాం. పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాం.

ప్రశ్న: శిబిరాల్లో ఏఏ వైద్య పరీక్షలు నిర్వహించారు?

జవాబు : సాధారణ చికిత్సలు, గర్భకోశ వ్యాధి నివారణకు చర్యలు, దూడల నట్టల నివారణ, పెద్దపశువులు (ఎద్దులు, బర్రెలు) నట్టల నివారణ, గొర్రెల్లో గొబ్బవ్యాధి లేకుండా నివారణ టీకాలు, పశుపోషణలో అవగాహన సదస్సులు నిర్వహించాం.

ప్రశ్న: ప్రస్తుతం అమలవుతున్న పథకాలు ఏవి?

జవాబు : పశుపోషకాలకు 90 శాతం రాయితీతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో మినీ గోకులం షెడ్లు, 246 పశువులకు 70 శాతం రాయితీతో గొర్రెలు, మేకల షెడ్లు, కోళ్లకు అవసరమైన షెడ్లు, ఇంకా పలు పథకాలు అమలులో ఉన్నాయి.

ప్రశ్న: మండలంలో ఎన్ని గోకులం షెడ్లు మంజూరయ్యాయి? ఎన్ని పూర్తయ్యాయి?

జవాబు : మండలపరిధిలో 23మంజూరయ్యాయి. 18పూర్తి అయ్యాయి. మూడు రూఫ్‌లెవల్, ఒకటి బేస్‌మట్టం లెవల్‌లో ఉన్నాయి. 18 షెడ్లు ఎంబుక్ రికార్డులు చేశాం.

ప్రశ్న: రాబోవు వేసవిలో పశుపోషకులు ఏఏ జాగ్రత్తలు పాటించాలి?

జవాబు : ఈ సారి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. పశుపోషకులు పశువులను ఉదయం 6 నుంచి 10గంటల్లోపు పొలాలకు తీసుకెళ్లి త్వరగా తిరిగిరావాలి. స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. ఎండ దెబ్బ తగలకుండా షెడ్లకు గోనెపట్టలు కప్పి నీళ్లు చిలకరించాలి. త్వరగా జీర్ణమయ్యే పశుగ్రాసం అందించాలి.

8 వరకు గడువు పొడిగింపు

- కోవెలకుంట్ల ఎక్సైజ్ శాఖ సీఐ టకీబాష

కోవెలకుంట్ల ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల దరఖాస్తు గడువు ఈనెల 8 వరకు ప్రభుత్వం పొడించినట్లు కోవెలకుంట్ల ఎక్సైజ్‌శాఖ సీఐ టకీబాష తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల ఎక్సైజ్‌శాఖ స్టేషన్‌లో సీఐ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు, ఈడిగకు ఒక మద్యం దుకాణం మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రంతో పాటు రూ. రెండులక్షల డీడీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో లేదా ఎక్సైజ్ స్టేషన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు సందీప్, ప్రవీణ్‌కుమార్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి వెల్లడించారు. మండలానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 55 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో బీసీ-ఏ 23, బీసీ-బి 14, బీసీ-డి 7, బీసీ-ఈ 11 యూనిట్లు కేటాయించారని తెలిపారు. అర్హత కలిగిన వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చాగలమర్రి: ఈబీసీ కులాల వారు కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 52 యూనిట్లు మంజూరయ్యాయని అన్నారు. 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామని అన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

నరసింహ, శివమాలధారులకు అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న అధ్యక్షుడు, దాతలు

చాగలమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో దీక్ష చేపట్టిన నరసింహస్వామి, శివస్వాములకు బుధవారం బీసీ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు రామతీర్థం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ నల్లానాగరాజు, కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రోహితిశ్వర్‌రెడ్డి, రమణ, రాము, సుబ్రమణ్యం, రామకృష్ణ, వినోద్, మాలధారులు పాల్గొన్నారు.

1,450 మంది కూలీలకు ఉపాధి పనులు

చాగలమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1,450 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించినట్లు ఏపీవో నిర్మల తెలిపారు. బుధవారం శెట్టివీడు గ్రామ సమీపంలో వంకలో తీస్తున్న పూడిక తీత పనులను పరిశీలించారు. 12 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని అన్నారు. కూలీలకు వందరోజులు పనిదినాలు కల్పించేందుకు గాను గ్రామాల్లో పనులు గుర్తించామని అన్నారు. వంకలు, వాగులు, కాలువలు, రహదారుల వెంట ముళ్ల కంపల తొలగింపు, ఫారంపాండ్ పనులను చేపట్టామని అన్నారు. ఆమె వెంట టీఏ రవి, ఎఫ్ఏ ఉన్నారు.

వారబందీ ద్వారా టీజీపీ నీరు విడుదల

చాగలమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వారబందీ ద్వారా టీజీపీ ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. బుధవారం చాగలమర్రి టీజీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వీబీఆర్ నుంచి టీజీపీ కాలువకు రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామ న్నారు. చాగలమర్రి మండలంలో దిగువన ఉన్న రైతులకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఏఈ నాయక్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

రుద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్‌పై ప్రజలకు అవగాహవ కల్పించాలని విద్యుత్ శాఖ డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి అన్నారు. బుధవారం రుద్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేసి సోలార్ విద్యుత్ వాడకానికి దగ్గర చేయాలని సూచించారు. విద్యుత్ బకాయిలు సకాలంలో వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఏఈ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.